# వేరు ద్వీపాలు

"అమ్మగారూ! అమ్మగారూ! అయ్యగారు పడిపోయాడు" ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు మోహన్.

అప్పుడే నిద్రలేచి బ్రష్ చేసుకుంటున్న మేడమ్ ప్రమీలకు కాస్సేపటిదాకా అతడు చెబుతున్నదేమిటో అర్థం కాలేదు.

"అయ్యగారు పడిపోవడమేమిట్రా నీ బొంద" అందామె నోట్లోంచి బ్రష్ తీసేసి నోట్లో ఉన్న టూత్‌పేస్ట్ నురుగును వాష్ బేసిన్లో తుపుక్కున ఉమ్మేస్తూ.

"పొద్దున్నే వాకింగ్‌కని పోయిన మన అయ్యగారు వాకింగ్ చేసుకుంటూనే పడిపోయిండట. మిమ్మల్ని త్వరగా రమ్మంటున్నారు. అయ్యగార్ని ఆటోల తీసుకొచ్చారు. ఆటో ఇప్పుడు మనింటి ముందే ఉంది. అయ్యగార్ని ఆసుపత్రికి తీసుకపోవాలట!" అన్నాడు మోహన్. ఆ కుర్రాడి మాటల్లో బోల్డు ఆందోళన, ఆతురత కనిపించాయి.

"దుక్కలా ఉన్న మీ అయ్యగార్ని హాస్పిటల్‌కు తీసికెల్లడమేమిట్రా. నీకేమన్నా పిచ్చిగాని పట్టిందార? నువ్వు ముందిక్కడ్నించి వెళ్లిపో! స్టుపిడ్" అందామె అతనికేసి నువ్విక్కడింకో క్షణం సేపున్నావంటే చంపేస్తానన్నట్టుగా చూస్తూ.

"నేను చెప్పేది కొంచెం వినండమ్మా! అయ్యగారు ఐదింటికే లేచి వాకింగ్‌కు వెళ్ళారు గదా. వేగంగానడుస్తోంటే గుండెలో నొప్పొచ్చి రొడ్డుమీదనే పడిపోయాడట. మన అయ్యగారితోటే వాకింగ్ జేస్తున్న మన పక్కింటి కల్నల్‌గారు అయ్యగార్ని లేపి, ఓ ఆటోను పిలిచి, దాంట్లో ఎక్కించి మనింటి ముందుకు తీసుకొచ్చారు. గుండెపోటంటున్నారు. మీరు త్వరగావస్తే ఆసుపత్రికి తీసుకెళ్తారట. త్వరగా రండమ్మా! అయ్యగార్ని త్వరగా ఆసుపత్రికి తీసుకపోకపోతే ప్రమాదమట" అన్నాడు మోహన్.

"నీ బొంద ! దుక్కలా ఉన్నాడు. ఆయనకేం ప్రమాదం రా? గుండెపోటా! పాడా? అంతా నాటకం. నన్ను ఫూల్‌ని చెయ్యడానికి ఆయనకిట్లాటి నాటకాలాట్టం మామూలే లేరా... కావాలంటే ఆ కల్నల్‌గార్నే మీ అయ్యగార్ని హాస్పిటల్‌కు తీసుకపొమ్మను. నా టైమ్ పాడుచెయ్యొద్దు. నేనివ్వాళ చాలా అర్జెంట్‌గా యూనివర్సిటీకెళ్లాలి. నా అండర్‌లో పి. హెచ్. డి చేసిన ఓ రిసెర్చ్ స్కాలర్‌కు ఇవ్వాళ 'వైవా' ఉంది. వేరే యూనివర్శిటీ నుండి ఇద్దరు ప్రొఫెసర్లొస్తున్నారు. వాళ్లను నేనే స్టేషన్‌కెళ్లి రిసీవ్ చేసుకోవాలి. నాకిప్పుడు అయ్యగార్ని హాస్పిటల్‌కు తీసికెళ్లేంత తీరికలేదని చెప్పు. ఈ రోజు లేవడమే చాలా లేట్‌గా లేచానని నేను కంగారుపడ్తున్నాను" అంది మేడమ్ ప్రమీల మరోసారి వాష్‌బేసిన్‌లో ఉమ్మేసి.

మోహన్ వెంటనే బయటకు పరిగెత్తాడు.

ఆ ఇంటిముందు ఆ కాలనీలో ఉండే చాలామంది జనం గుమిగూడి ఆటోలో పడుకొని శ్వాసతీసుకోవడానికి చాలా ఇబ్బంది పడ్తున్న ఆర్డీవో జగన్నాథాన్ని ఆశ్చర్యంగా, ఆందోళనగా చూస్తూ నిల్చున్నారు.

జగన్నాథం గుండెమీద చెయ్యి పెట్టుకొని విపరీతంగా ఆయాసపడిపోతున్నాడు. అతనిది భారీ శరీరం. ఆ శరీరమంతా చెమటతో నిండిపోయింది. అతని పక్కనే నిల్చున్న కల్నల్ వైకుంఠం "బీ కామ్, బీకామ్! ప్రశాంతంగా ఉండండి ఆర్డీవోసాబ్! మీకేం కాదు. మీ మేడమ్‌గారు రాగానే మిమ్మల్ని హాస్పిటల్‌కు తీసుకెళ్తాం" అంటున్నాడు.

ఇంట్లోంచి పరిగెత్తుకొని వచ్చిన మోహన్ “మేడమ్‌గారు అర్జెంట్‌గా యూనివర్శిటీకి వెళ్ళాలట! ఇప్పుడు ఆసుపత్రికి రారట. మిమ్మల్నే అయ్యగార్ని ఆసుపత్రికి తీసుకుపొమ్మంటున్నారు” అన్నాడు కల్నల్ వైకుంఠంగార్ని ఉద్దేశించి.

“డ్యామిట్! వాటీజ్ దిస్! ఓ పక్క కట్టుకున్న మొగుడు చావుబతుకుల్లో ఉంటే తను యూనివర్శిటికెళ్తుందా? మొగుడికంటే ఉద్యోగమే ముఖ్యమా ఆమెకు? నేను వెళ్లి ఆమెతో మాట్లాడివస్తానుండండి” అంటూ ఇంట్లోకెళ్లడానికి సిద్ధమయ్యాడు రిటైర్డ్ కల్నల్ వైకుంఠం.

“కల్నల్‌సాబ్! మీకు ఆమె సంగతి తెలీదు. ఆమె రానంటే రాదు. అంతే. మీరు నన్ను వెంటనే హాస్పిటల్‌కు తీసికెళ్లండి. దానికోసం చూస్తూ టైమ్ వేస్ట్ చేశారంటే నేను చచ్చిపోతాను” అన్నాడు జనన్నాథం కల్నల్‌కేసి చేతులు జోడించి.

“ఓ.కె! ఓ.కె! అలాగే తీసికెళ్తాను. మీ కారును బయటకు తీసి కార్లో తీసికెళ్లనా?” అన్నాడు కల్నల్

“వద్దు వద్దు. మీరు కారు బయటకు తీసేలోగా నా ప్రాణాలే పోతాయి. ఈ ఆటోలోనే వెళ్దాంరండి” అన్నాడు జగన్నాథం.

“ఓ.కె! ఓ.కె! బాబూ ఆటో డ్రైవర్! మమ్మల్ని వెంటనే ఇక్కడికి దగ్గర్లో ఉన్న ప్రియదర్శినీ హాస్పిటల్‌కు తీసుకెళ్లు” అన్నాడు కల్నల్ వైకుంఠం, తను కూడా అతి కష్టంగా చోటుచేసుకొని ఆటోలో జగన్నాథం పక్కనే కూర్చుంటూ.

ఆటో అక్కన్నించి కదిలింది. దాని వెనకాలే ఇటీవలె జగన్నాథం ఇంట్లో పనిచెయ్యడానికి కుదిరిన పన్నెండేళ్ల మోహన్ పరిగెత్తాడు.

ఆటో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రియదర్శినీ హాస్పిటల్ ముందుకొచ్చి ఆగింది.

వెంటనే స్ట్రెచర్ తెప్పించి జగన్నాథాన్ని దానిమీద పడుకోబెట్టి లోపలకు తీసుకెళ్లారు.

డ్యూటీలో ఉన్న డాక్టరొచ్చి జగన్నాథాన్ని చూశాడు. స్ట్రోకొచ్చిందని ధృవపరచి వెంటనే ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో చేర్పించాలన్నాడు. కల్నల్ వైకుంఠం వెంటనే జగన్నాథాన్ని ఐసీయూలో చేర్పించి మోహన్‌ను అక్కడుంచి, అతడు వాళ్లింటికెళ్లిపోయాడు. డాక్టర్లు జగన్నాథాన్ని మూడు రోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి పరీక్షలన్నీ చేశారు. వెంటనే హైదరాబాద్ తీసికెళ్లి ఆంజియోగ్రామ్ తీయించుకొని ఎన్ని బ్లాకులున్నాయో తెలుసుకోవాలనీ, అవసరమయితే బైపాస్ సర్జరీ చేయించాలని సలహా ఇచ్చారు. వెంటనే ఆ పని చెయ్యకపోతే చాలా ప్రమాదమని కూడా హెచ్చరించారు.

ఆర్డీవో జగన్నాథాన్ని చూడటానికి అతని కొలీగ్స్ చాలా మందే హాస్పిటల్ కొచ్చారు. కలెక్టర్‌తో సహా విజయవాడలో ఉండే పెద్ద ఆఫీసర్లందరూ హాస్పిటల్‌కొచ్చి జగన్నాథాన్ని చూసి పలకరించి, పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షలు చెప్పి వెళ్లిపోయారు. ఇంత మందొచ్చినా అతని భార్య మేడమ్ ప్రమీల మాత్రం మూడు రోజులదాకా ఆ హాస్పిటల్ ఛాయలకే రాలేదు. జగన్నాథం దగ్గర ఎంఆర్వో సుగుణాకర్, మోహన్ ఈ ఇద్దరే ఉండిపోయారు.

మేడమ్ ప్రమీల ప్రొఫెసర్‌గా పనిచేసే విజయవాడకు ముప్ఫయికిలోమీటర్ల దూరంలో ఉండే యూనివర్శిటీలో ఆమె కొలీగ్స్ చాలా మంది ఆమెను చూడగానే

“ఇప్పుడు మీ హజ్బెండ్‌కెలా ఉంది మేడమ్?” అని అడిగారు.

“ఆయనకేమయిందని మీరిలా అడుగుతున్నారని” మేడవ్ ప్రమీల బోల్డు ఆశ్చర్యపడిపోయింది.

“స్ట్రోకొచ్చిందటకదా?” అన్నారు వాళ్లు.

"స్ట్రోకా? పాడా? మొన్న రాత్రి ఫ్రెండ్స్‌తో పెద్ద పార్టీ చేసుకున్నాడు. స్కాచ్‌విస్కీ డోస్ ఈసారి కొంచెం ఎక్కువైనట్టుంది. దాని హాంగోవరే ఇదంతా" అంది మేడమ్ ప్రమీల చాలా నిర్లక్ష్యంగా.

"అయితే మీ హజ్బెండ్‌కొచ్చింది స్ట్రోక్ కాదన్నమాట. జస్ట్ హాంగోవర్! దట్సాల్! అంతేనా?" అన్నాడు మేడమ్ ప్రమీల పనిచేస్తున్న హిస్టరీ డిపార్ట్‌మెంట్‌లోనే పనిచేసేస్తున్న ప్రొఫెసర్ శాంతినారాయణ.

"అంతేనండి. తిన్నదీ, తాగిందీ అరిగించుకోలేని వాళ్లకొచ్చేరోగమది. రేపీపాటికాయన మామూలు మనిషైపోయి. మళ్లీ పెగ్గుల మీద పెగ్గులు స్కాచ్ విస్కీ పట్టించేసి నా ప్రాణాలు తోడేస్తాడు" అంది మేడమ్ ప్రమీల.

"మీరిలా ఒకరి ప్రాణాలొకరు తోడేసుకుంటూ ఎంతకాలం కాపురం చేస్తారు మేడమ్?" అన్నాడు ప్రొఫెసర్ శాంతినారాయణ.

"ఎంత కాలమైనా చెయ్యాలి. మెడకుబడ్డ పాము కరవకమానదుగదా! అసలీ మొగవాళ్లందరూ పాములేనని నా ఉద్దేశ్యం. మేల్ చావనిస్టు పిగ్స్" అందామె పళ్లు కొరుకుతూ..

"యా! యా! ఐ అగ్రీ విత్ యూ" అంటూ అదో మాదిరిగా మొఖం పెట్టి కారెక్కి వెళ్లిపోయాడు గొప్ప ఫెమినిస్టుగా ముద్రవేయించుకున్న ప్రొఫెసర్ శాంతినారాయణ.

జగన్నాథం హాస్పిటల్లో జాయినయిన మూడోరోజు మేడమ్ ప్రమీల యూనివర్శిటీ నుండి ఇంటికెళ్తూ తనే డ్రైవ్ చేస్తున్న తన కారును ప్రియదర్శిని హాస్పిటల్ వైపు మరలించింది. హాస్పిటల్ లోపల కార్ పార్క్ చేసి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో కొచ్చి జగన్నాథం పడుకున్న బెడ్ దగ్గరకొచ్చింది. ఆమెను చూడగానే ఆర్దీవో జగన్నాథం చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా మారిపోయాడు.

"హాయ్ పమ్మీ! నువ్వొచ్చావా? నిజంగా వచ్చావా? నా కళ్లను నేను నమ్మలేకపోతున్నా. వ్వాట్ ఏ ప్లెజెంట్ సర్‌ప్రైజ్ మై డార్లింగ్ పమ్మీ! మై స్వీట్ లిటిల్ పమ్మీ !" అంటూ జగన్నాథం బిగ్గరగా నవ్వాడు.

"హార్ట్ పేషెంట్స్ అంత పెద్దగా నవ్వకూడదు సార్" అన్నాడు జగన్నాథం బెడ్‌పక్కనే నిల్చొని అతనికి బత్తాయిరసం తీసిస్తున్న ఎంఆర్వో సుగుణాకరరావు.

"ఆయన హార్ట్ పేషెంటేమిటి నా బొంద! మనందర్నీ ఆటపట్టించడానికాయన హార్ట్ పేషెంట్‌లా నటిస్తున్నాడు. నిజంగా ఈయన హార్ట్ పేషెంటే అయితే ఇలా జోక్స్ కట్ చేస్తూ పగలబడి నవ్వుతాడా? ఎనీవే... ఈయనకో విషయం చెప్పడానికి నేనిక్కడికొచ్చాను. ఇంకో వారం రోజుల్లో ఢిల్లీలో ఓ ఇంటర్నేషనల్ సెమినార్ జరగబోతున్నది. ఆ సెమినార్‌లో నేనో పేపర్ ప్రెజెంట్ చెయ్యబోతున్నాను. టాపికేమిటంటే "గ్లోబలైజేషన్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండియన్ విమెన్" ఈ ఫీల్డ్‌లో నేను చాలా వర్క్ చేశానని నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రపంచమంతటి నుండి చాలా గొప్పగొప్ప మేధావులు ఈ సెమినార్‌లో తమ పేపర్స్ ప్రెజెంట్ చెయ్యబోతున్నారు. నేనీ రోజు నుంచి ఆ పేపర్ రాసే పనిలో తలమునకలుగా ఉంటాను. కాబట్టి నువ్విక్కడ హాస్పిటల్లో ఉన్నావని నీ పక్కన కూర్చొని నీకు సేవలు చేసే ఓపికా, తీరికా నాకు లేవు. దయచేసి నువ్వు నా నుంచి అలాంటి సేవలు ఎక్స్‌పెక్ట్ చెయ్యొద్దు అని చెప్పటానికే నేనిప్పుడొచ్చాను. నేనెళ్తున్నా" అంది మేడమ్ ప్రమీల బయటకెళ్లడానికి సిద్ధమౌతూ.

"నువ్వు నాకు ఇదివరకెప్పుడో మహాసేవలు చేశావని, ఇప్పుడు చేస్తావని ఎక్స్‌పెక్ట్ చేస్తానా? అలాంటి భ్రమలేవీ నాకు లేవుగానీ కాస్సేపు అలా కూర్చో మైడియర్ పమ్మీ! నీ అందమైన

రూపాన్ని కాస్సేపు నా కళ్లనిండా చూసుకోనీయ్. ఇప్పుడే విరబూసిన రోజాలా ఆ పింక్ కలర్ శారీలో ఎంతందంగా ఉన్నావో! నిన్నా శారీలో చూస్తోంటే నా సారో అంతా మటుమాయమైపోతోంది మై డియర్ పమ్మీ!. నిన్నిట్లా చూస్తోంటే నా గుండెమళ్లీ మామూలుగా మారిపోతోంది. నువ్వు నా ధర్మపత్నివి. నా అర్థాంగివి. నా ఊర్వశివి. నా ప్రేయసివి. నా సర్వస్వానివి. నువ్వు నాకే సేవలూ చెయ్యొద్దు. అలా నా ముందు కాస్సేపు కూర్చో! నీ కళ్లలోకి కాస్సేపు చూడనీయ్ చాలు! నేను నిన్ను మళ్లీ ఇలా చూస్తానోలేదో మై డియర్ పమ్మీ!" అన్నాడతడు ఓ రకమైన పారవశ్యంలోకెళ్లిపోతూ.

మేడమ్ ప్రమీల నిజంగా అతడు వర్ణించినట్టే చాలా అందంగా ఉంటుందని ఆమెను చూసిన వాళ్లెవరైనా వెంటనే అంగీకరిస్తారు.

"కవిత్వం వల్లించి, ఇదివరకటిలాగే నన్ను కరిగించి, నీ వశం చేసుకుంటాననుకోకు. ఆ రోజులు పోయాయి. నీ ఈ కన్నింగ్‌నెస్ ఇప్పుడు నా దగ్గర పనిచెయ్యదు. నీ ఫ్లాటరీతో మోసపోను. నీకే రోగం లేదని నాకు తెలుసు. నేను ఢిల్లీకి వెళ్లి ఆ ఇంటర్నేషనల్ సెమినార్‌లో పాల్గొనకుండా ఆపడం కోసమే నువ్వీ నాటకం మొదలెట్టావని నాకు తెలుసు. కానీ నేను ఢిల్లీ వెళ్లితీరతాను. నన్నెవరూ ఆపలేరు" అంటూనే నుదుటిమీద పడ్తున్న ఆమె బాబ్డ్ హేర్‌ని విసురుగా పైకి తోసేసుకుంటూ ఆమె అక్కడ్నించి కదిలి డోర్ తెరచుకొని హైహీల్స్ షూజ్‌ని టకటకలాడించుంటూ విసావిసా నడుస్తూ బయటకు వరండాలోకి వెళ్లిపోయింది.

"చూశావా సుగుణాకర్. దటీజ్ మై వైఫ్ మేడమ్ ప్రమీల! ఆర్ ప్రొఫెసర్ ప్రమీల!" అన్నాడు జగన్నాథం నవ్వుతూ. అతని నవ్వులో స్పష్టంగా చెప్పలేని నిర్వేదంలాంటిదేదో కనిపించింది. పక్కనే వున్న సుగుణాకర్‌కు.

ఆరోజు జగన్నాథాన్ని చూడటానికి చాలా మందే వచ్చారు. అతని కొలీగ్స్ మాత్రమే కాకుండా ఆ ఊర్లో ఉన్న అతని బంధువులు కూడా చాలా మందొచ్చారు. వాళ్లందరితోనూ జగన్నాథం చాలా హుషారుగా మాట్లాడాడు. జోక్స్ చెప్పాడు. అందర్నీ నవ్వించాడు. తనూ నవ్వాడు. అతన్ని అలా చూస్తోంటే మేడమ్ ప్రమీల చెప్పినట్టు అతడు నిజంగా హార్ట్‌పేషెంటేనా అన్న అనుమానం కల్గింది. సుగుణాకరానికి.

"మిమ్మల్ని డాక్టర్లు ఎక్కువగా మాట్లాడవద్దన్నారు సార్!" అన్నాడు సుగుణాకర్ మరో సారి.

"మాట్లాడితే చచ్చిపోతావని డాక్టర్లంటారు. మాట్లాడకపోతే చచ్చిపోతానని నేనంటాను. ఓసారి బెట్రాండ్‌రస్సెల్ విమానంలో ప్రయాణం చేస్తూ ముందు వరసలో కూర్చొని చుట్టకాల్చుకుంటున్నాడట. ఎయిర్ హోస్టెస్ వచ్చి ఇక్కడ పొగతాగకూడదని చెప్పిందట.

"పొగతాగకపోతే నేను చచ్చిపోతా" అన్నాట్ట రస్సెల్.

"అయితే ప్లేన్ వెనక కేబిన్ ఉంది. దాంట్లోకెళ్లి పొగపీల్చండి" అందిట ఎయిర్ హోస్టెస్.

రస్సెల్ ప్లేన్ వెనక భాగానికెళ్లి హాయిగా చుట్ట కాల్చుకుంటున్నాడట. అప్పుడు ఆయన ప్రయాణం చేస్తున్న ఆ విమానం ఓ సముద్రంలో కూలిపోయిందట. ముందు సీట్లలో కూర్చున్న వాళ్లందరూ చనిపోయారట. వెనక కేబిన్‌లో కూర్చున్న రస్సెల్ బతికాడట. "పొగతాగకపోతే చచ్చిపోతాన"న్న ఆయన మాట నిజమైందా? కాలేదా?" అంటూ జగన్నాథం మరోసారి ఫెళ్లున నవ్వాడు.

"బహుశా ఈయన నవ్వే ఈయనను బతికిస్తోందేమో" అనుకున్నాడు సుగుణాకర్.

రెండ్రోజుల తర్వాత జగన్నాథానికి మళ్లీ స్ట్రోకొచ్చింది. అతన్ని వెంటనే హైదరాబాద్ తీసికెళ్లి అపోలో లాంటి సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్లోనో జాయిన్ చేయించి బైపాస్ సర్జరీ చేయిస్తేనే తప్ప ఆయన బతకడని డాక్టర్లు తేల్చి చెప్పారు. జగన్నాథాన్ని హైదరాబాద్ షిఫ్ట్ చెయ్యడానికి ఇక్కడ విజయవాడ హాస్పిటల్ వాళ్లు అంబులెన్స్ కూడా ఇస్తామన్నారు.

సుగుణాకర్ వెళ్లి మేడమ్ ప్రమీలను కలిశాడు.

"సార్‌ను హైదరాబాద్ తీసికెళ్లమంటున్నారు మేడమ్! సార్‌తో మీరొస్తారా మేడమ్!" అన్నాడు సుగుణాకర్ భయపడ్తూనే.

"నేనా? ఇంపాజిబుల్! నేను రెండ్రోజుల్లో ఢిల్లీ వెళ్తున్నాను. ఓ గొప్ప ఇంటర్నేషనల్ సెమినార్‌లో పేపర్ ప్రెజెంట్ చేసే గొప్ప అవకాశాన్ని నన్ను కోల్పోమని చెప్పడానికొచ్చావా? అబ్సర్డ్! ఆయనకో రెండు పెగ్గులు మంచి స్కాచ్‌విస్కీ పోసివ్వండి. లేచి కూర్చుంటాడు. నా మీద, ఆడవాళ్ల మీద బోల్డు డర్టీ జోక్స్ చెప్పి అందర్నీ నవ్విస్తాడు. ఆయనకు స్ట్రోకు రాలేదని నీకు మరోసారి చెబుతున్నాను. ఇట్స్ వోల్లీయె ప్రిటెన్స్! నేనా ఇంటర్నేషనల్ సెమినార్‌లో పాల్గొని పేపర్ ప్రెజెంట్ చేస్తే నాకు ఇంటర్నేషనల్ గుర్తింపు వస్తుందని లోలోపల కుళ్లి చస్తున్నాడు. డుయూనో? హి ఈజ్ ఎ మేల్ చౌవనిస్ట్ పిగ్! ఆల్ మెన్ ఆర్ మేల్ చౌవనిస్ట్ పిగ్స్! ఐ కేర్ ఎ డ్యామ్ ఫర్‌దెమ్!" అందామె పళ్లు కొరుకుతూ.

కాస్సేపు వాళ్లిద్దరి మధ్యా నిశ్శబ్దం.

"సార్‌ను హైదరాబాద్ తీసికెళ్లి బైపాస్ సర్జరీ చేయించాలంటే చాలా డబ్బు అవసరమౌతుంది. పోనీ మీరు డబ్బేమన్నా అరేంజ్ చేస్తారా మేడమ్" అన్నాడు సుగుణాకర్.

"డబ్బా! నా దగ్గరెక్కడుంది? నీకో సంగతి తెలుసో తెలీదో... మొదట్నించీ అంటే మా పెళ్లయినప్పట్నించీ, అతని డబ్బు నాకివ్వడు. నా డబ్బు ఆయనకివ్వను. మావి సెపరేట్ ఎకౌంట్స్. అమెరికన్ సిస్టమ్‌ని మేమీ గ్లోబలైజేషన్‌కంటే ముందు నుంచే ఫాలో అవుతున్నాం. అతని ఎకౌంట్‌లో డబ్బు ఉండే ఉంటుంది. డ్రా చేసి తీసుకుపో" అంది మేడమ్ ప్రమీల.

"సార్ ఎకౌంట్‌లో పెద్దగా డబ్బు లేదని చెప్పాడు మేడమ్"

"అంతా తాగేసి ఉంటాడు. ఈ విషయంలో నేనేమీ చెయ్యలేను. లెట్‌హిమ్ గోటు హెల్! నా దగ్గర డబ్బులేదు. ఒకవేళ ఉన్నా ఇవ్వను. యూకెన్‌గో నౌ" అంది మేడమ్ ప్రమీల.

సుగుణాకర్ ఆ ఇంట్లోంచి బయటకొచ్చి "యేం చేద్దామా?" అని కాస్సేపు ఆలోచించాడు.

జగన్నాథం కారణంగానే సుగుణాకర్‌కు ఈ ఎం.ఆర్‌వో ఉద్యోగం వచ్చింది. యే ఆధారం లేని సుగుణాకరాన్ని ఎన్నోసార్లు జగన్నాథం ఆదుకున్నాడు. ఇంట్లో పెట్టుకొని చదివించాడు. అందుకే సుగుణాకర్‌కు జగన్నాథం దేవుడితో సమానం.

సుగుణాకర్ హాస్పిటల్‌కొచ్చి "మేడమ్‌గారు డబ్బేమీ లేదన్నారు సార్. ఇప్పుడేం చేద్దాం? మిమ్మల్ని వెంటనే హైదరాబాద్ తీసికెళ్లకపోతే చాలా ప్రమాదమని డాక్టర్లు పదేపదే చెబుతున్నారు" అని జగన్నాథంతో చెప్పాడు.

"డాక్టర్లు అలాగే చెబుతార్లేరా సుగుణాకర్! డోన్ట్ వర్రీ టూ మఛ్! ఓ పని చెయ్యి. కల్నల్ వైకుంఠం ఈజ్ వన్ ఆఫ్‌మై బెస్ట్ ఫ్రెండ్స్. ఆయన్నో ఇరవైవేలు అరేంజ్ చెయ్యమన్నానని చెప్పు. మొదలైతే హైదరాబాద్ వెళ్దాం. అపోలోలో జాయినవుదాం. ఆ తర్వాత చూద్దాం. అక్కడ ఏ ఆపద్బాంధవుడైనా ఆదుకోకపోతాడా?" అన్నాడు జగన్నాథం.

"సార్! మీ అబ్బాయి బాంబేలో పెద్ద డాక్టర్‌కదా! ఆయనకు ఫోన్ చేస్తే వెంటనే డబ్బు అరేంజ్ చేస్తాడేమో" అన్నాడు సుగుణాకర్.

"వాడెలా రియాక్టవుతాడో చెప్పలేంరా సుగుణాకర్! గ్లోబలైజేషన్‌కదా! పైకి ప్రపంచమంతా ఒక గ్రామమే కానీ ఎవడికి వాడే యమునాతీరే! ఏకత్వం లేదిప్పుడు. అంతా భిన్నత్వమే. ఎవడి డబ్బు వాడిదే. ఎవడి ఎకౌంట్ వాడిదే. తల్లి లేదు. తండ్రీ లేదు. ఉన్నదొక్కటే... అదే డబ్బు.

మొదలైతే మనం హైదరాబాద్ వెళ్దాం. తర్వాత చూద్దాం" అన్నాడు జగన్నాథం.

సుగుణాకర్ కల్నల్ వైకుంఠం దగ్గరకెళ్లాడు. జగన్నాథంగారు ఇరవై వేలిమ్మన్నాడని చెప్పాడు. అతడు నీదే బాధ్యత అంటూ సుగుణాకర్ చేతిలో ఇరవైవేలు పెట్టాడు.

సుగుణాకర్ ఆ డబ్బు తీసుకొని హాస్పిటల్ కొచ్చాడు. జగన్నాథాన్ని అంబులెన్స్ ఎక్కించి హైదరాబాద్ తీసికెళ్లాడు. అపోలో హాస్పిటల్లో అడ్మిట్ చేశాడు. జగన్నాథానికి సుగుణాకర్ తప్ప మరెవ్వరూలేరన్నట్టుగా సుగుణాకర్ ఇరవై నాల్గుగంటలూ జగన్నాథంతోటే ఉండిపోయాడు.

హాస్పిటల్లో జగన్నాథానికి మరోసారి పరీక్షలన్నీ చేశారు. ఆంజియోగ్రామ్ తీశారు. గుండెకు రక్తాన్ని తీసికెళ్లే ఆర్టరీస్‌లో మూడు చోట్ల హెవీ బ్లాక్స్ ఉన్నాయని తేల్చారు. వెంటనే బైపాస్ సర్జరీ చెయ్యాలన్నారు. రెండు లక్షలు ఖర్చవుతుందన్నారు. లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తే ఆపరేషన్ చేస్తామన్నారు.

"లక్ష రూపాయలెట్ల రావాలె సార్" అన్నాడు సుగుణాకర్.

"చెయ్యొద్దనుకున్నానుగానీ తప్పేట్టులేదు. మా వాడి ఫోన్ నెంబరిస్తాను. ఈ రాత్రి బాంబేకు ఫోన్ చేసి వాడికి విషయమంతా చెప్పి వెంటనే డబ్బు తీసుకొని ఫ్లైట్‌లో రమ్మను" అన్నాడు జగన్నాథం. తన డైరీలో చూసి కాగితం మీద ఓ నెంబర్ రాసి సుగుణాకర్ చేతికిచ్చాడు.

ఆ రాత్రి రెండు మూడు సార్లు ప్రయత్నం చేశాక చివరకు పదకొండున్నరకు బాంబేలో ఉంటున్న జగన్నాథం కొడుకు డా॥ హరీష్ సుగుణాకర్‌కు ఫోన్‌లో దొరికాడు.

"హల్లో డాక్టర్ హరీష్! నేను హైదరాబాద్ నుండి సుగుణాకర్‌ని మాట్లాడుతున్నాను. మీ డాడీ దగ్గర నేను ఎంఆర్‌వోగా పనిచేస్తున్నాను. నన్ను మీరు రెండు మూడు సార్లు మీ డాడీ దగ్గరకొచ్చినప్పుడు చూశారు. గుర్తుపట్టారా?"

"హాయ్ సుగుణాకర్! మిమ్మల్ని గుర్తుపట్టకపోవడమేమిటి? మీరు మా డాడీకి చాలా క్లోజ్‌కదా! చెప్పండి. ఎవ్రీథింగ్ ఈజ్ ఓకే కదా?" అన్నాడు డా॥హరీష్.

"మీ డాడీగారి ఆరోగ్యం యేమాత్రం బాగాలేదు. గతవారంలో రెండుసార్లు స్ట్రోకొచ్చింది. ఇప్పుడు హైదరాబాద్ తీసుకొచ్చి అపోలోలో అడ్మిట్ చేశాం. ఆంజియోగ్రామ్ తీశారు. మూడు చోట్ల హెవీబ్లాక్స్ ఉన్నాయట. వెంటనే బైపాస్ చెయ్యాలంటున్నారు."

"వో... ఐసీ!"

"నేను తప్ప సార్ వెంట ఎవ్వరూ లేరు. మీ మమ్మీ గారేమో ఢిల్లీలో జరగబోతున్న ఇంటర్నేషనల్ సెమినార్ అటెండ్ చెయ్యడానికెళ్లారు. మీరన్నా ఇక్కడికొచ్చి ఇక్కడి డాక్టర్లతో మాట్లాడి, ఆపరేషన్ అయిపోయే దాకా మీ డాడీ పక్కనుంటారని మీకు ఫోన్ చేస్తున్నాను సార్".

"నేనా? జస్ట్ నాట్ పాజిబుల్ సుగుణాకర్‌గారూ! ఎందుకంటే నేనిక్కడ్నించి ఐదారు రోజులదాకా కదిలే పరిస్థితి లేదు. నేనిక్కడ వరసగా ఐదు రోజులు ఐదు మేజర్ ఆపరేషన్లు చెయ్యాల్సి ఉంది. ఎవ్రిథింగ్ ఈజ్ ఫిక్స్‌డ్. ఆ పేషంట్లందరూ వీవీఐపీలే. అన్నీ ఎమర్జెన్సీ ఆపరేషన్లే. సర్‌ప్రైజింగ్లీ, నేను చేస్తున్నవి కూడా బైపాస్ సర్జరీలే. డాడీ ఆపరేషన్ గురించి చాలా ముందుగా తెలుసుంటే రాగలిగేవాన్నేమో. డాడీ ఆపరేషన్ డేట్ ఫిక్సయ్యాక ఫోన్

చెయ్యండి. కాస్సేపొచ్చి చూస్తాను. థాంక్యూ వెరీమచ్ సుగుణాకర్‌గారు... మీరు డాడీకి చాలా సర్వీసు చేస్తున్నారు. థాంక్యూ" అంటూ డా॥హరీష్ ఫోన్ పెట్టెయ్యబోయాడు.

"ఉండండుండండి... అప్పుడే ఫోన్ పెట్టెయ్యకండి. బైపాస్ సర్జరీకి చాలా డబ్బు అవసరమౌతుంది కదా! ప్రస్తుతం మీ డాడీ దగ్గర డబ్బేమీ లేదు. లక్ష రూపాయలు డిపాజిట్ చెయ్యాలి. మీరా డబ్బు....."

"డాడీ దగ్గర లక్ష రూపాయలు లేవా? అబ్సర్డ్! ఇలాంటివాటికి ఇంకొకరి మీద ఆధారపడటం సభ్యతకాదని డాడీకి తెలీదా? నా దగ్గర మాత్రం లక్ష రూపాయలుంటాయని ఆయనెలా అనుకున్నాడు? ఆపరేషన్ డేట్ ఫిక్సయ్యాక నాకు ఫోన్ చెయ్యండి" అంటూనే డాక్టర్ హరీష్ ఫోన్ పెట్టేశాడు. సుగుణాకర్ కాసేపటిదాకా మామూలు మనిషి కాలేకపోయాడు. గొప్ప వాళ్లు ఇలాగే ఉంటారేమో! అనుకున్నాడతడు.

సుగుణాకర్ హాస్పిటల్ కొచ్చి జగన్నాథానికి విషయం చెప్పాడు. జగన్నాథం ఓ చిత్రమైన నవ్వు నవ్వి ఊరుకున్నాడు. అతడు పెద్దగా ఆశ్చర్యపడ్డట్టుగా గానీ, షాకయినట్టుగాగానీ, కనిపించలేదు. చాలా సేపటి తర్వాత

"పోనీయ్‌లే సుగుణాకర్! నువ్వో పనిచేస్తావా? స్టేట్స్‌లో ఉన్న మా అమ్మాయితో మాట్లాడి చూస్తావా? ఇదే మన చివరి ప్రయత్నం. ఈ ప్రయత్నం కూడా ఫెయిలయితే నువ్వు నన్ను నా ఫేట్‌కు వదిలేసి వెళ్లిపో" అంటూనే జగన్నాథం వాళ్లమ్మాయి ఫోన్ నెంబర్ ఓ కాగితం మీద రాసి సుగుణాకర్‌కిచ్చాడు.

జగన్నాథంగార్కి ఓ కొడుకు, ఓ కూతురు. ఇద్దరూ డాక్టర్లే. వాళ్ల అల్లుడూ, కోడలు కూడా డాక్టర్లే. ఆయన కూతురు, అల్లుడు యునైటెడ్ స్టేట్సాఫ్ అమెరికాలో ఉంటున్నారు.

సుగుణాకర్ జగన్నాథం కూతురు డా॥హారికకు ఫోన్ చేశాడు. ఆమె ఇంట్లో లేదని, మెస్సేజ్ ఏమిటో చెప్పమని ఆన్సరింగ్ మెషీన్ జవాబిచ్చింది. అలా మూడు, నాల్గుసార్లు ప్రయత్నం చేశాక డా॥హారికతో సుగుణాకర్ మాట్లాడగల్గాడు.

"నేను డాడీకి డబ్బు సర్దడమేమిటి? ఇలాంటి ఎమర్జెన్సీస్ వస్తాయని డాడీకి తెలీదా? హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోలేదా? ఇక్కడ మేమందరమూ తప్పనిసరిగా హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకుంటాం. యాభయి ఎనిమిదేళ్లొచ్చి. డాడీకి హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం ఈజ్ సింప్లీ హైటాఫ్ స్టుపిడిటీ! అయినా మా డాడీ ఇండియన్ గదా! ఇండియాలో ఎవరూ ఏమీ చెయ్యరు. ప్రపంచం ఎంత మారినా ఇండియా మాత్రం మారదు. అదో రెచ్చెడ్ కంట్రీ! దాన్నెవ్వరూ బాగుచెయ్యలేరు. ఆపరేషనయ్యాక డాడీ ఎలా ఉన్నారో చెప్పండి" అంటూనే ఆమె ఫోన్ పెట్టేసింది.

ఈసారి సుగుణాకర్ షాక్ నుండి త్వరగానే కోలుకున్నాడు. అయినా కట్టుకున్న భార్య, కన్న కొడుకు, కన్న కూతురు తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడని తెలిసినప్పుడుకూడా ఇలా ప్రవర్తించగల్గుతారన్నది అతని ఊహకందని విషయం. బాగా డబ్బున్న వాళ్ల కుటుంబ సంబంధాలు ఇలాగే ఉంటాయి కాబోలు అనుకున్నాడతడు.

"మీ కూతురిలా అన్నదనీ చెప్పినప్పుడు కూడా జగన్నాథం పెద్దగా ఆశ్చర్యపడ్డట్టు కనిపించలేదు.

"వేరొకర్ని డబ్బడగాల్సిన పరిస్థితి రానే వద్దు. కానీ వచ్చింది. ఏమౌతుందో చూద్దాం" అన్నాడు జగన్నాథం.

"మీ కొడుకు, కూతురు కూడా వేరొకరౌతారా సార్?" అన్నాడు సుగుణాకర్.

"వేరొకరే. ఇప్పుడంతా అమెరికనైజేషన్ కదా! దీన్నే ముద్దుగా గ్లోబలైజేషన్ అంటున్నారు. ఈనాటి ఈ ప్రపంచంలో ఎవడి బతుకువాడే బతకాలి. ఎవడి చావు వాడే చావాలి. కొడుకు, కూతురని అనుకోవడం పిచ్చి సెంటిమెంట్స్"

"మీరు వాళ్ళకోసం ఏం చెయ్యలేదా సార్?"

"చేశాను...మిమ్మల్ని లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి పెంచాను. పెద్ద చేశాను. చదివించాను. పెళ్లిళ్లు చేశానని ఇప్పుడు నేనంటే వాళ్ళేమంటారో తెలుసా? ఒళ్లు బలిసి కన్నావు. కన్నావు కాబట్టి చేశావు. ఎవడి కోసం చేశావు? అంటారు. అందుకు మన దగ్గర జవాబేది?" అన్నాడు జగన్నాథం.

జగన్నాథానికి యాభై ఎనిమిదేళ్ళుంటాయి. అయినా ఆయనింకా గవర్నమెంట్ సర్వీసులో ఉండటానికి కారణం ఆయన హెచ్.ఎస్.సి సర్టిఫికేట్ ప్రకారం ఆయన వయస్సు యాభై ఆరేళ్ళే కావడం. ఇంకో రెండేళ్లలో ఆయన రిటైరయిపోతాడు. హార్ట్ ఆపరేషన్‌కయ్యే ఖర్చులో చాలా భాగం ప్రభుత్వం భరిస్తుంది. కానీ అదంతా జరగడానికి చాలా టైమ్ పడుతుంది. ప్రభుత్వోద్యోగి కాబట్టి ఆయన ఆపరేషన్ చేయించుకున్న తర్వాత కూడా 'రీ ఇంబర్స్‌మెంట్" కోసం ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకోవచ్చు.

జగన్నాథానికి చాలా మంచి ఆఫీసర్ అన్న పేరుంది. అతన్ని గుర్చి అందరూ చాలా సౌమ్యుడు, నీతిమంతుడు, మచ్చలేనివాడు, కుళ్ళులేనివాడు, మనసులో ఏదుంటే అది కుండబద్దలుకొట్టినట్టు చెప్పేస్తాడు అనే చెప్పుకుంటారు. తనకింద పనిచేసేవాళ్ళందరికీ చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా మేలే తప్ప కీడు చెయ్యడని కూడా జగన్నాథాన్ని గుర్చి చెప్పుకుంటారు. అతని పై ఆఫీసర్లు కూడా అతన్నెంతో గౌరవిస్తారు. సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న మనిషి అనీ అతన్ని ప్రశంసిస్తారు. ఈ కారణం చేతనే జగన్నాథాన్ని చూడటానికి హాస్పిటల్‌కు రోజూ చాలామందే వస్తుండేవాళ్లు. జగన్నాథం బంధువుల్లో కూడా చాలామంది డబ్బున్నవాళ్లే. అధికారం, హోదా ఉన్నవాళ్ళేనని సుగుణాకర్ గమనించాడు.

జగన్నాథానికి ఇద్దరు అన్నలూ, ఓ తమ్ముడూ ఉన్నారు. వాళ్ళు హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వాళ్లు వాళ్ళ భార్యలతో వచ్చి జగన్నాథాన్ని చూసి వెళ్లారు. జగన్నాథం ఇద్దరన్నల్లో ఒకాయన ఐఏఎస్ ఆఫీసర్. మరో అన్న ఐపీఎస్ ఆఫీసర్. వాళ్లు రెండోసారి జగన్నాథాన్ని చూడటానికి హాస్పిటల్‌కొచ్చినప్పుడు సుగుణాకర్ ధైర్యం చేసి వాళ్లతో డబ్బు విషయం మాట్లాడాడు. "మీరిద్దరూ చెరో యాభైవేలు సర్దండి. అలా అయితేనే ఈ ఆపరేషన్ జరుగుతుంది" అని చెప్పాడు. వాళ్ళిద్దరూ సుగుణాకర్ అలా అడిగినందుకు నొచ్చుకున్నట్టుగా కనిపించారు. అతనికేసి సభ్యత తెలీని మనిషివి అన్నట్టుగా చూశారు. ఓ క్షణంసేపు ఆలోచించి "సారీ! మా దగ్గరంత డబ్బులేదు" అంటూ వెళ్లిపోయారు.

"సార్‌కు రీఎంబర్స్‌మెంట్ రాగానే మీ డబ్బు మీకు తిరిగిచ్చేస్తాం సార్" అని సుగుణాకర్ చెప్పిన మాటను వాళ్ళు వినిపించుకోవడానికి ప్రయత్నించలేదు.

జగన్నాథం తమ్ముడేమో! పెద్ద జర్నలిస్ట్. ఆయన్ను కూడా సుగుణాకర్ "డబ్బేమన్నా అడ్జస్ట్ చెయ్యగలరా సార్!" అని అడిగాడు. "సారీ... నా దగ్గరంత డబ్బులేదు. నాకు యే నెల సంపాదన ఆ నెలకే సరిపోతుంది. ఉంటే తప్పకుండా ఇచ్చేవాన్నే" అంటూ వెళ్ళిపోయాడు.

సుగుణాకర్‌కు చాలా ఆశ్చర్యం కలిగింది.

వీళ్ళంతా కొన్ని లక్షల విలువ చేసే కార్లలో వస్తున్నారు. బంజారాహిల్స్‌లాంటి ప్రాంతాల్లో కొన్ని కోట్లు విలువ చేసే బిల్డింగుల్లో ఉంటున్నారు. వీళ్ళకు యాభైవేలంటే యాభైరూపాయలతో

సమానం. అలాంటి వాళ్ళు తోడబుట్టినవాడు చావుబతుకుల్లో ఉన్నారని తెలిసి కూడా కొంచెం కూడా స్పందించకపోవడం, ఆందోళన చెందకపోవడం సుగుణాకర్‌ను ఆశ్చర్యపరచింది. వాళ్ల గుండెల్లో ఆర్ధ్రత అన్నది చచ్చిపోయిందా? అనుకున్నాడతడు.

మొదట్లో జగన్నాథం సుగుణాకరాన్ని అతనింట్లో ఉంచుకొని చదివించడం సుగుణాకర్ ఎప్పుడూ మరచిపోలేదు. బి.ఏ.పాసయ్యాక జగన్నాథమే సుగుణాకర్‌తో పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్ష రాయించాడు. ఇంటర్వ్యూకు పంపించాడు. ఎవరెవరికో చెప్పి తనకీ ఎంఆర్‌వో ఉద్యోగం వచ్చేలా చేశాడు. అతడు తనకు చేసిన ఈ మేలును ఎప్పుడూ మరచిపోలేను అనుకుంటాడు సుగుణాకర్. తనే ఎవరి కాళ్లైనా పట్టుకొని, డబ్బు తెచ్చి జగన్నాథానికి బైపాస్ సర్జరీ చేయించి బతికించకపోతే తనను తాను క్షమించుకోలేననుకున్నాడు.

.... .... ....

"ఏమిట్రా సుగుణాకర్. ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అన్నాడు జగన్నాథం.

"మీకు ఆపరేషన్ చేయించడం ఎలాగా అని. లక్ష రూపాయలెవరిస్తారా అని" అన్నాడు సుగుణాకర్.

"ఆపరేషన్ చేయించకపోతే ఏమౌతుందిరా? చచ్చిపోతాను. అంతేకదా! ఎప్పుడో అప్పుడు అందరం చచ్చిపోవాల్సిన వాళ్లమే కదా! 'జాతస్యః మరణం ధృవం' పుట్టిన వాడు చచ్చిపోక తప్పదని తెలిసిన వాళ్లమే కదా! చావంటే నాకు భయంలేదురా. చావు ఎప్పుడూ మనల్ని వెంటాడ్తూ ఉంటుంది. చావు మన నేస్తంరా సుగుణాకర్" అంటూ జగన్నాథం పెద్దగా నవ్వసాగాడు.

"వద్దు సార్! మీరలా అనొద్దు. మీకు ఆపరేషన్ చేసి మిమ్మల్ని బతికించకపోతే నన్ను నేను క్షమించుకోలేను సార్"

"ఎందుకురా? ఎందుకురా నువ్వంతగా ఫీలౌతున్నావు?"

"మీరు నాకుచేసిన సహాయాన్ని నేనీ జన్మలో మరచిపోలేనుసార్. ఎక్కడో పల్లెటూర్లో మొరటు కష్టం చేస్తూ ఉండిపోవాల్సిన నాకు ఇలాంటి జీవితాన్ని మీరే ఇచ్చారు సార్. మీరుణాన్ని నేనీ జన్మలో...."

"పిచ్చోడా! నేను నీకు చేసిన సహాయం పెద్దగా ఏమీలేదురా. నీకు చదువులో తెలివితేటలున్నాయి కాబట్టి నువ్వీ స్థితికొచ్చావు. నువ్వు మా ఊరివాడివి కాబట్టి నిన్ను తీసుకొచ్చి స్కూల్లో వేశాను. నీకు చేసిందానికంటే కొన్ని వందల రెట్లు నేను ఇంకెంతో మందికి చేశాను. వాళ్లంతా ఇప్పుడేరి? కట్టుకున్న భార్య, కన్నకొడుకు, కూతురు, తోడబుట్టిన అన్నలూ, తమ్ముళ్లూ అందరూ నన్ను వదిలేశారుగదా? నువ్వొక్కడివి మిగిలావు. నీలాంటి వాళ్లను చూసినప్పుడేరా ఈ ప్రపంచంలో ఇంకా మంచితనం, మానవత్వం చచ్చిపోలేదనిపిస్తుంది" అంటూనే జగన్నాథం కళ్లనీళ్లు పెట్టుకొని ఏడవడం మొదలెట్టాడు.

"ఊరుకోండి సార్! ప్లీజ్‌సార్! ఊరుకోండిసార్!" అన్నాడు సుగుణాకర్.

కాస్సేపట్లో జగన్నాథం మళ్లీ మామూలు మనిషయ్యాడు.

"ఈ ఊర్లో నాకో చెల్లెలుంది సార్! మా బావ బట్టల వ్యాపారం చేస్తాడు. ఆయనకో బట్టల షాపుంది. ఆయన దగ్గరికెళ్లి డబ్బేమయినా సర్దగలడేమో అడుగుతాను" అన్నాడు సుగుణాకర్.

"అలాగే అడిగిరా రా! మీ బావగారితో నీ డబ్బు ఎక్కడికీ పోదని చెప్పు. నాకు రీఎంబర్స్‌మెంట్ రాగానే ఆయన డబ్బు ఆయన కిచ్చేస్తానని చెప్పు" అన్నాడు జగన్నాథం.

సుగుణాకర్ ఆ రోజే వాళ్ల చెల్లెలింటికెళ్లాడు.

వాళ్ల బావగార్ని కలిశాడు. విషయమేమిటో చెప్పాడు.

"అంత గొప్ప వ్యక్తికి సహాయం చేసే అవకాశం మనలాంటి చిన్నవాళ్లకు లభించడం మన అదృష్టమే"నన్నాడు వాళ్ల బావగారు. నా దగ్గరకూడా అంత డబ్బు రెడీగాలేదు. కానీ నా తోటి బిజినెస్ చేసే వాళ్లనడుగుతాను. వాళ్లు తప్పకుండా మనకీ సహాయం చేస్తారు. నువ్వు రేపురా! ఓ పది మందినైనా అడిగి నువ్వడిగినంత డబ్బు రెడీ చేస్తాను" అన్నాడాయన.

సుగుణాకర్ ఆ మర్నాడు సిద్దిఅంబర్ బజార్లో ఉంటున్న వాళ్ల బావగారింటికెళ్లి డబ్బు తెచ్చి హాస్పిటల్లో డిపాజిట్ చేశాడు. ఆ మర్నాడే జగన్నాథానికి ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెప్పారు. ఈ విషయాన్ని ఎందుకైనా మంచిదనుకొని సుగుణాకర్ ముంబైకి ఫోన్ చేసి డా॥హరీష్‌కు తెలియజేశాడు.

ఆ మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకు డా॥జగన్నాథాన్ని ఆపరేషన్ థియేటర్‌కు తీసికెళ్లారు. జగన్నాథాన్ని ఆపరేషన్ థియేటర్‌కు తీసికెళ్లిన అరగంట తర్వాత ముంబై నుండి డా॥హరీష్ ఆ హాస్పిటల్‌కొచ్చాడు. అతన్ని చూడగానే సుగుణాకర్‌కు కొండంత బలమొచ్చినట్టనిపించింది. తనొక్కడే కాకుండా జగన్నాథాన్ని చూసుకోవడానికి స్వయంగా ఆయన కొడుకే వచ్చాడని సంతోషించాడు.

"మీ డాడీని ఇప్పుడే ఆపరేషన్ థియేటర్లోకి తీసికెళ్లారు. మీరు కూడా పెద్ద డాక్టర్లే కాబట్టి మిమ్మల్ని ఆపరేషన్ థియేటర్లోకి ఎలౌవ్ చేస్తారు. మీరు లోపలికెళ్లి ఆపరేషన్ పూర్తయ్యేవరకు అక్కడే ఉండిపోతే బావుంటుంది" అన్నాడు సుగుణాకర్.

"డాడీని ఆపరేషన్ థియేటర్లోకి తీసుకపోకముందే నేనొచ్చుంటే బావుండేది. ఫ్లైట్ కొంచెం లేటయ్యింది. నేను ఆపరేషన్ థియేటర్లోకెళ్లి చేసేదేమీలేదు. ఎవ్విరిథింగ్ ఈజ్ ఇన్ ది హాండ్సాఫ్ డాక్టర్స్ దేర్! నేనిప్పుడే రిటర్న్ ఫ్లైట్‌లోనే ముంబై వెళ్లిపోవాలి. అక్కడ నేను పని చేస్తున్న హాస్పిటల్లో నేనో ఎమర్జెన్సీ ఆపరేషన్ చెయ్యాలి. ఐ మస్ట్ గో ఇమ్మీడియెట్లీ" అన్నాడు డా॥హరీష్.

"మీరు కనీసం మీ డాడీని ఆపరేషన్ థియేటర్లోంచి బయటకు తీసుకొచ్చేంతవరకైనా ఉండరా?" అన్నాడు సుగుణాకర్ దిగజారిపోతున్న గుండెల్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తూ.

"సారీ సుగుణాకర్‌గారూ! బైపాసంటే లెంథీ ఆపరేషన్. చాలా టైమ్ పడ్తుంది. నేనింకో గంటలో ముంబైలో ఉండితీరాలి. లేకపోతే డిజాస్టరయిపోతుంది. నా ఉద్యోగం పోతుంది. మీరే డాడీని చూసుకోండి. నేనింకో రెండు మూడు రోజుల్లో మరోసారొచ్చి డాడీని చూసి వెళ్తాను" అంటూనే సుగుణాకర్ సమాధానం కోసం కూడా చూడకుండా డా॥హరీష్ ఆ హాస్పిటల్లోంచి పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ బయటకు వెళ్లిపోయాడు.

"ఈ మాత్రం దానికి ఈయన ముంబై నుంచి ఇక్కడిదాకా ఎందుకొచ్చినట్టు?" అనుకున్నాడు సుగుణాకర్.

సుగుణాకర్ వరసగా వారం రోజులు ఆ హాస్పిటల్లోనే ఐసీయులో జగన్నాథాన్ని పడుకోబెట్టిన బెడ్ పక్కనే నేల మీద పడుకుంటూ జగన్నాథాన్ని కంటికి రెప్పలా చూసుకున్నాడు. ఆపరేషన్ పూర్తి కావడానికి ఆరేడు గంటలు పట్టింది. ఏడెనిమిది గంటలదాకా పేషెంట్‌కు అనెస్తీషియా మత్తు వదల్లేదు.

ఆ తర్వాత రెండ్రోజుల వరకు అతడు మామూలు మనిషి కాలేకపోయాడు. గుండె మీదుండే పక్కటెముకల్ని కోసేసి గుండెను ఓపెన్ చేస్తారట. తొడలోంచి నరాలను తీసి వాటిని గుండెకమర్చి గుండెకు రక్తప్రసారం జరిగేలా చేస్తారట. ఇదంతా ఊహించుకుంటుంటేనే సుగుణాకర్‌కు భయమేసింది. ఆపరేషన్ పూర్తయి జగన్నాథానికి స్పృహ వచ్చాక పక్కటెముకల్ని కోసేసిన

కారణంగా వస్తున్న నొప్పితో అతడు పడ్తున్న బాధను చూస్తోంటే సుగుణాకర్ కళ్లకు నీళ్లొచ్చాయి. నొప్పి తీవ్రంగా ఉందని జగన్నాథం చెప్పినప్పుడల్లా సుగుణాకర్ వెళ్లి డాక్టర్‌ను తీసుకొచ్చేవాడు. ఇంజెక్షన్ ఇవ్వగానే అతని నొప్పి తగ్గిపోతుండేది. ఈ వారం రోజులు సుగుణాకర్‌కు నిద్రాహారాలు లేవు. అతన్ని కాస్సేపయినా జగన్నాథం దగ్గర్నించి బయటకు స్నానం చెయ్యడానికో, టిఫిన్ చెయ్యడానికో పంపించడానికెవరూ రాలేదు. రాత్రిళ్లు జగన్నాథం పడుకున్న బెడ్ పక్కనే కటిక నేల మీద పడుకునేవాడు. అతనికి బట్టలు మార్చుకొని రావటానిక్కూడా అవకాశం దొరకలేదు. వారం రోజులు స్నానం చెయ్యకుండా, బట్టలు మార్చుకోకుండా అప్పుడప్పుడు హాస్పిటల్లో ఉన్న కాంటీన్‌కెళ్లి టిఫిన్ చేస్తూ సుగుణాకర్ జగన్నాథానికి అన్ని రకాల సేవలు చేస్తూ హాస్పిటల్లోనే ఉండిపోయాడు.

.... .... ....

సరిగ్గా వారం రోజుల తర్వాత మేడమ్ ప్రమీల ఢిల్లీ నుండి విమానంలో తిరిగొస్తూ హైదరాబాద్‌లో దిగి భర్తను చూడటానికి హాస్పిటల్‌కొచ్చింది. ఆమెను చూడగానే జగన్నాథం మొహం వెలిగిపోయింది.

"హాయ్ పమ్మీ! వచ్చావా? నిజంగా వచ్చావా? నీ దివ్య సుందర విగ్రహాన్ని చూడటం కోసమే నేనీ ప్రాణాల్ని నిలుపుకున్నాను తెలుసా? అలా నిలుపుకున్నందుకిప్పుడు ఫలితం దక్కింది. కోహినూర్ వజ్రంలాంటి నిన్నూ, నీ ముఖారవిందాన్ని మరోసారి చూడగల్గాను. ఇంత గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు థాంక్యూ డార్లింగ్! థాంక్యూ వెరీమచ్" అన్నాడు జగన్నాథం చాలా ఉల్లాసంగా మారిపోయి.

"భార్యను చూసినప్పుడల్లా ఈ పెద్ద మనిషి ఇంత హుషారుగా, ఉల్లాసంగా ఎందుకు మారిపోతాడో అర్థం కాదు" అనుకున్నాడు సుగుణాకర్.

"కవిత్వం ఆపేసి నిజం చెప్పండి, మీకు నిజంగా బైపాస్ సర్జరీ జరిగిందా?" అంది మేడమ్ ప్రమీల, అతన్ని తన తీక్షణమైన చూపులతో చీల్చేలా చూస్తూ.

"డాక్టర్లయితే ఆపరేషన్ చేశామంటున్నారు. నాక్కూడా చేశారనే అనిపిస్తోంది. ఎందుకంటే నా శరీరాన్ని కోసినట్టు రుజువు చేసే ఈ గుర్తులున్నాయికదా! కావాలంటే నువ్వు కూడా చూడు డార్లింగ్" అంటూ అతడు తన మీదున్న బ్లాంకెట్‌ను తొలగించబోయాడు.

"వద్దు... నువ్వేం చూపించొద్దు. ఐ డోంట్‌వాంట్ టు సీ దట్ రెచ్చెడ్ థింగ్. నువ్వో పెద్ద ఆఫీసర్‌వి. నీ దగ్గర బోల్డు డబ్బుంటుంది. నీ దగ్గర్నించి ఓ రెండు లక్షలు లాగొచ్చునని ఇక్కడి డాక్టర్లు నీకీ ఆపరేషన్ చేసుంటారు. ఇలాంటి యూజ్‌లెస్ ఆపరేషన్లు చేసి నీలాంటి రిచ్ పేషెంట్స్ నుండి లక్షలకు లక్షలు గుంజకపోతే ఇలాంటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎలా బతుకుతాయి? ఎనీవే, లెట్ ఇట్‌బి... నేను వెళ్తున్నాను. ఇప్పుడే ఫ్లైట్ దిగి నిన్ను చూసిపోదామని ఇలా వచ్చాను. ఇంకా స్నానం కూడా చెయ్యలేదు. నువ్వింకా ఈ రెచ్చెడ్ హాస్పిటల్లో ఎన్ని రోజులుండాలట". అంది మేడమ్ ప్రమీల బయటకెళ్లిపోవడానికి సిద్ధమౌతూ.

ఈసారామెతో సుగుణాకర్ మాట్లాడాడు. "ఇంకా ఒకటి రెండు రోజులైనా ఉండాలంటున్నారు మేడమ్! ఓ రిక్వెస్ట్ మేడమ్! మీరు కాస్సేపు సార్ దగ్గర ఉండండి. నేను కాస్సేపు మా చెల్లెలింటికెళ్లి స్నానం చేసి బట్టలు మార్చుకొని కాస్సేపు రెస్ట్ తీసుకొని వచ్చేస్తాను. వారం రోజుల్నుంచీ, అంటే సార్‌ను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకుపోయి ఆపరేషన్ చేసినప్పట్నించీ, ప్రతి రోజూ ఇరవైనాల్గు గంటలు నేను సార్ పక్కనే ఉంటున్నాను. నన్నో అరగంటసేపైనా రిలీవ్ చెయ్యడానికెవరూ రాలేదు. వారం రోజుల్నుండి నేను స్నానం చెయ్యలేదు.

బట్టలు మార్చుకోలేదు. సార్ బెడ్ పక్కనే కటిక నేలమీద పడుకుంటున్నాను. సరిగ్గా తిన్నది లేదు. నిద్రపోయిందిలేదు. సార్‌కు తల్లో, భార్యో తప్ప మరెవ్వరూ చెయ్యడానికిష్టపడని సేవలన్నీ చేస్తున్నాను. దయచేసి మీరీరోజు ఓ గంటసేపన్నా సార్ దగ్గరుంటే నేను కాస్సేపు మా సిస్టరింటికెళ్ళి స్నానం చేసి బట్టలు మార్చుకొని, నాల్గు మెతుకులు తినొస్తాను" దీనంగా అన్నాడు సుగుణాకర్.

"మిస్టర్ సుగుణాకర్! ఆర్యూ జోకింగ్? నేను ఈ రెచ్చెడ్ హాస్పిటల్లో ఈ రెచ్చెడ్ పేషెంట్ దగ్గర గంట సేపుండటమా? నాకు హాస్పిటల్స్ అంటేనే ఎలర్జీ. ఇక్కడి స్మెల్ నాకస్సలు పడదు. వామిటింగొస్తుంది. నేనీ రోజే యూనివర్శిటీలో డ్యూటీలో జాయిన్‌కావాలి. అయామ్‌సారీ సుగుణాకర్. అయినా నువ్వు బయటకెళ్ళకుండా వారం రోజులు ఈయన పక్కనే ఎందుకున్నావు? ఈయనను చూసుకోవడానికి నర్సులూ, డాక్టర్లు వార్డుబోయ్స్ లేరా? చేస్తున్న కొద్దీ చేయించుకోవడం ఈయన నేచరని నీకు తెలీదేమో. ఈయనను నువ్వు చాలా గొప్పవాడనుకుంటున్నట్టున్నావు. ఈయనకు ఆడవాళ్ళ పిచ్చి చాలా ఎక్కువని నీకు తెలీదనుకుంటాను. నువ్వీయన్ను ఇక్కడుండే నర్సులకప్పగించేసి వెళ్ళిపోతే చాలా సంతోషించేవాడు. ఎందుకంటే నర్సులతో సరసాలాడటం, నర్సులనేకాదు ఆడవాళ్ళెవరైనా సరే వాళ్ళతో సరసాలాడటం ఈయనకు చాలా ఇష్టం. హీ ఈజ్ ఎ బ్లడీ వుమనైజర్! అండ్ ఎ గ్రేట్ బూజర్‌టూ! పచ్చిగా మాట్లాడుతున్నాననుకోకు. కాకపోతే నీకింకో విషయం కూడా చెప్పాలి. హి ఈజ్ ఎ సెక్స్‌మేనియాక్. ఇతనికి నాచురల్ సెక్స్ పనికిరాదు. పర్వర్టెడ్ సెక్సయితేనే తృప్తిపడ్తాడు. హిఈజ్ ఎ బ్లడీ పర్వర్ట్. సెక్స్ విషయానికొస్తే ఈ మగవాళ్ళంతా ఇంతే! బయటపెద్ద సంస్కారవంతుల్లా కనిపిస్తారు. బెడ్ రూమ్స్‌లో మాత్రం పశువుల్లా మారిపోతారు. అందుకే నాకు మీ సారంటే అసహ్యం. అతడు నన్ను చూడగానే చెప్పే కవిత్వమంతా ఓ ముసుగు, ఎ మాస్క్! నన్నతడు సెక్స్ ఆబ్జెక్ట్‌లా తప్ప ఓ మనసున్న మనిషిగా చూడలేదు. దట్స్‌వై ఐ హేట్ హిమ్ విత్ ఆల్‌మై హార్ట్ అండ్ సోల్. నేను వెళ్తున్నా సుగుణాకర్! నువ్వు కూడా మీ సిస్టరింటికెళ్ళి రిఫ్రెష్ అయిరా. ఈయనకేమీకాదు. నర్సులను చూస్తూ హాయిగా ఎంజాయ్ చేస్తాడు. ఆయనకోసం నువ్వెందుకు నీ ఆరోగ్యం పాడుచేసుకుంటావు?, అంటూనే ఆమె, రూమ్ డోర్ తెరుచుకొని బయటకెళ్ళబోయింది.

"మేడమ్! ప్లీజ్! ఒక్క క్షణం ఆగండి. హాస్పిటల్ బిల్లు ఇవ్వాళే ఇచ్చారు. చాలా అయింది. డిపాజిట్ చేసిన లక్ష రూపాయలు పోగా ఇంకో లక్ష రూపాయలయ్యింది. దయచేసి మీరే ఆ ఎమౌంట్‌ను అరేంజ్ చెయ్యాలి. రీ ఎంబర్స్‌మెంటొచ్చాక సార్ మీ డబ్బు మీకిచ్చేస్తారు" అన్నాడు సుగుణాకర్. చేతులు జోడించి హాస్పిటల్ బిల్లును ఆమె చేతిలో పెట్టాడు.

"నేను ఈయనకు లక్ష రూపాయలివ్వాలా? ఇదివరకీయన మళ్ళీ ఇస్తానని నా ఎకౌంట్ లోంచి చాలా డబ్బే డ్రా చేసుకొని మళ్ళీ వాటి ప్రసక్తే తీసుకురాలేదు. మరో సారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈయనకు నా ఎకౌంట్‌లోంచి డబ్బు తీసియ్యొద్దని నిర్ణయించుకున్నాను. సో దట్సాల్!" అంటూ ఆమె చేతిలో ఉన్న హాస్పిటల్ బిల్లును జగన్నాథం మీదకు విసిరేసి బయటకు వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ జగన్నాథం ఓసారి నవ్వాడు. ఓసారి ఏడ్చాడు. అతడు కప్పుకున్న బ్లాంకెట్ మీద పడిపోయిన హాస్పిటల్ బిల్లును తన చేతిలోకి తీసుకుంటూ సుగుణాకర్

"బాధపడకండి సార్! నేను ఎలాగైనా ఈ డబ్బు కూడా మా బావగారిద్వారా అరేంజ్ చేస్తాను. రేపు మిమ్మల్ని హాస్పిటల్ నుండి డిస్చార్జి చేయించి మా సిస్టర్ ఇంటికి తీసికెళ్తాను.

అక్కడో నాల్గు రోజులుండి, మరోసారి ఈ హాస్పిటల్ కొచ్చి చెకప్ చేయించుకున్నాక మనం విజయవాడ వెళ్లిపోదాం" అన్నాడు సుగుణాకర్.

"నేను బాధపడ్తున్నది డబ్బుకోసం కాదు సుగుణాకర్! డబ్బెలాగైనా వస్తుంది. కానీ గడిచిపోయిన నా యాభై ఎనిమిదేళ్ల జీవితం తిరిగొస్తుందా? ఈమెను... నా భార్యను, నా అర్థాంగిని ఎంత పిచ్చిగా ప్రేమించానో. ఈమె అందం నాకెంత పిచ్చెక్కించేదో గుర్తు చేసుకుంటే అప్పటి నేనూ, ఇప్పటి నేనూ ఒకరమేనా అనిపిస్తోంది. ఈమె కోసం నేను మా అమ్మను వదిలేశాను. ఈమెను ప్రసన్నం చేసుకోవడానికి ఎంతటి త్యాగానికైనా వెనకాడే వాడిని కాను. అప్పటి ఈమె మీది నా ఆరాధనను, నా ఆవేశాన్ని, నా మోహాన్ని ఇప్పుడీమె పర్వర్షన్ అంటోంది. నన్నో సెక్స్ మేనియాక్కింద జమకడ్తోంది. వ్వాటె పిటీ! వ్వాటె పిటీ! నీ మీద నేను జాలిపడాలా? ఆమె మీద జాలిపడాలా? నాకర్థం కావడంలేదు. నా మీద నేనే జాలిపడాలి. ఎందుకంటే అంతా నేను చేసుకున్నదే. స్వయంకృతం. నా ఈ ట్రాజడీకి నేనే కారణం. మరెవ్వరూ కారణం కాదు.

ఓ గొప్ప ఫిలాసఫర్ అన్నట్టు ఈ జీవితం ఒక నిష్ప్రయోజనమైన ఆవేశం! లైఫ్ ఈజ్ ఏ యూజ్‌లెస్ పాషన్. ఎట్‌లీస్ట్, మై లైఫ్ వాజ్‌ఎ యూజ్‌లెస్ పాషన్. నాకిప్పుడు ప్రమీల మీద కోపం లేదు. ద్వేషంలేదు. ఆమె నన్ను ఇంతగా ద్వేషించడానికి నేనే కారణం. ఆమె నన్ను ద్వేషించేలా నేనే చేశాను. అంతా నేను చేసుకున్నదే. ఈ ప్రపంచంలో మనిషనే వాడు పూర్తిగా ఒంటరివాడు. అన్నీ అతడే సృష్టించుకుంటాడు. అన్నింటినీ అతడే నాశనం చేసుకుంటాడు. పరిస్థితులు, సమాజం, సాంప్రదాయం అన్నీ హంబగ్! వీటి కారణంగానే నేనిలా చేశాను. అని చెప్పుకోవడం ఎస్కేపిజం! బ్యాడ్ ఫెయిత్! ఆత్మవంచన... నేనింతకాలం ఆ ఆత్మవంచనలోనే బతికాను. ఇప్పటికైనా కళ్లు తెరిచాననుకుంటున్నాను."

జగన్నాథం అలా చాలా సేపు తనతో తను మాట్లాడుకుంటున్నట్లుగా మాట్లాడుతోంటే సుగుణాకర్‌కు ఈయన అపస్మారక స్థితిలోకెళ్లిపోయాడా? అన్న అనుమానం కల్గింది. అతడు మాట్లాడుతున్నదేమిటో సుగుణాకర్‌కు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. ఈ మనిషిని పట్టుకొని తనింకా ఈ హాస్పిటల్లో ఎన్ని రోజులుండాలో అన్న భయం సుగుణాకర్‌లో ప్రారంభమయింది. వెంటనే "నర్స్, డాక్టర్" అంటూ వాళ్లకోసం పరిగెత్తాడు.

(విపుల మాసపత్రిక, జులై 2003)